# మినీ కథ

## లాభం



"ఏమండీ!" హడావిడిగా వచ్చిన బాలాజీ పిలిచాడు వెంకట్రామయ్యను. అతనెప్పుడూ అంతే హడావిడి యెక్కువ. ఏదైనా చిన్న విషయమైనా, పొరపాటు జరిగితే తనవల్ల తప్పు జరిగిందని అవతలివాళ్ళు భావిస్తారేమోనని అతను కంగారుపడుతుంటాడు. అతను పిలచిన ఆ వెంకట్రామయ్య వాళ్ళ ఇంటి ఓనరు. సదరు వెంకటరామయ్య కిరాణా వ్యాపారస్థుడు. అతనికి ఆ ఊళ్ళో రెండు ఇళ్ళున్నాయి. బాలాజీ వాళ్ళున్న ఇల్లు కాక రెండో యింట్లో అతనుంటున్నాడు. తల తిప్పి బాలాజీని చూశాడు వెంకట్రామయ్య. తన దుకాణం ముందు ఎవరో పెద్ద మనుషులతో మాట్లాడుతున్నాడతను. అందుచేత ఊరికే ఒకసారి చూడడంవరకే చేసి, నవ్వి, మళ్ళీ అవతల వాళ్ళతో కబుర్లలోకి దిగాడు వెంకటరామయ్య. ఐదు నిమిషాలయినా ఆ పెద్దమనుషులు వదలకపోవడంతోనూ బాలాజీ చిన్నగా అసహనంగా కదుల్తుండడం ఓరకంటితో గమనించడం చేతనూ వెంకట్రామయ్య "ఏమిటోయ్?" అని బాలాజీని విషయం కదిపాడు.

"ఏమీలేదండీ" కాస్త జంకుతూ ప్రారంభించాడు బాలాజీ. "మా ఆవిడ ప్రొద్దుట మీకు అద్దె యిచ్చిందట గదా!" అనగానే "అవునవును" అన్నాడు వెంకట్రామయ్య విషయం ఏమిటో అర్థంకాక.

"ఆ కవరు మీది కాదు. మరొకళ్ళకి యివ్వవలసినది. పొరపాటున మా ఆవిడ మీకిచ్చేసింది. అందులో మీ అద్దె కంటె ఏభై ఎక్కువ వున్నాయి." ధైర్యం చేసి అన్నాడు. వెంకట్రామయ్య ఒక క్షణం ఆలోచించి, "భలేవాడివయ్యా! నేను రెండుసార్లు లెక్క పెట్టుకున్నావస్తూ. సరిగ్గా నా కివ్వవలసినదే వుంది అందులో. పొరబడ్డావు" అని నవ్వాడు.

గిజగిజలాడాడు బాలాజీ. ఇక రెట్టించి అడిగితే ఆయనను అనుమానించినట్లవుతుంది. పైగా అవతల పెద్ద మనుషులు కూడా వున్నారు. "సరే! నేనే పొరబడి వుంటానులెండి. ఏమీ అనుకోకండి" జంకుతూ అన్నాడు బాలాజీ. "ఫర్వాలేదులేవయ్యా! ఇలాటి పొరపాట్లు ఎవరికైనా సహజం" అన్నాడు వెంకట్రామయ్య అతని భుజం తడ్తూ.

వెంకట్రామయ్యది నిజ జీవితంలో కూడా బిజెనెస్ మైండే. తన రెండో యింట్లో వున్న నాల్గు గదుల ద్వారా మూడు వందల అద్దె సంపాదిస్తున్నాడు. పైగా. ఆ గదుల్లో వుడుకుంచే కాళ్ళు బయటకు వస్తాయి. అయినప్పటికీ మిగతా సౌకర్యాలుండడంచేత బాలాజీ వాళ్ళు రెండు గదులలో ఎడ్జస్ట్ అవుతున్నారు. నిజానికి వెంకట్రామయ్య అద్దె లెక్కపెట్టుకోనేలేదు. కానీ. వస్తున్న ఏభై రూపాయల లాభాన్ని వదలుకోవడం యిష్టంలేని అతని మనసుకు మెరపులాంటి ఆలోచన తట్టి, లెక్కపెట్టుకొన్నట్లు అబద్ధం ఆడేశాడు.

ఆలోచనలో పడ్డాడు బాలాజీ. పెద్ద చిక్కే! అతను ఉద్యోగరీత్యా నెలకు ఎనిమిది వందలు సంపాదిస్తున్నప్పటికీ. ఇద్దరు పిల్లలు భార్య, తను మెయిన్‌టైన్ అవడానికి సరిపోతోందీ రోజులలో. పై ఖర్చు ఏదైనావస్తే అప్పు చెయ్యాల్సిందే

నిన్ననే జీతాలు వచ్చాయి. జీతం వచ్చినా రాకపోయినా వెంకట్రామయ్య మాత్రం ఠంచన్‌గా రెండవ తారీకునే వస్తాడు. అందుచేత ఇంటిఅద్దె నూటఏభై ఒక కవరులో. తను తీర్చవలసిన బాకీలు రెండువందలు ఒక కవరులో, కాలీగ్ సూర్యానికి యివ్వవలసిన బాకీ వంద రూపాయలు మరొక. కవరులో పెట్టి అలమరలో పెట్టాను. ఏ టైంలో వచ్చినా వెంకట్రామయ్యకు డబ్బిచ్చెయ్యమని భార్యతో చెప్పాడు.

అయితే సూర్యం మధ్యాహ్నం ఊరు వెడతాడు గనుక ఉదయమే వస్తానన్నాడు. పిల్లవాడిని ఆస్పత్రికి తీసుకొని వెళ్ళాల్సి వచ్చింది బాలాజీకి. అక్కడికీ ఎనిమిది దాకా చూశాడు. అతను తిరిగి వచ్చేలోపలే వెంకట్రామయ్య. సూర్యాలు రావడం. అతని భార్య వాళ్ళకు డబ్బులివ్వడం. వాళ్లు వెళ్ళడం జరిగిపోయాయి.

ఆఫీసుకు బయలుదేర్తూ అలమరలో చూస్తే నూటఏభై రూపాయల కవరు మాత్రం వుంది. ఒకక్షణం కంగారుపడ్డాడతను. అదే విషయం భార్యతో చెప్పాడు.

"ఏమోనండీ! నేను వంట కంగారులో ఉండగా వెంకట్రామయ్యగారు వచ్చారు. ఏమిచ్చానో హడావిడిలో. పైగా ఆయన వెంట ఎవరో వున్నారు కూడా. వెళ్ళి కనుక్కోండి దారిలో" అంది. ఆమె కూడా కాస్త కంగారుపడుతూ. కనుక్కుంటే ఫలితం ఇది

ఆఫీసుకు చేరుకున్నాడు బాలాజీ. మైండంతా ఖరాబుగావుంది. ఏభై రూపాయలంటే మాటలా? ఆఫీసుకు సూర్యం వచ్చాడు. "హలో బ్రదర్! ఊరు ప్రోగ్రాం క్యాన్సిలయింది. అందుకే లీవ్ క్యాన్సిల్ చేసుకొని వచ్చాను. ఏమిటి అలా వున్నావ్?" అని అడిగి వెంటనే "ఉదయం నేను తీసుకువెళ్ళిన కవర్లో రెండువందల రూపాయలున్నాయి. నా కివ్వవలసింది వందేగా! ఇదిగో వంద" అంటూ అందించాడు. అవాక్కయ్యాడు బాలాజీ.

ఆర్య